
# లోహగంటలు

## శ్రీవిరించి

చీకటిగది. ప్రొఫెసర్ రామనాథం అందులోనే పచార్లు చేస్తున్నాడు. మనసంతా గతకాలపు ఆలోచనలతో అతలాకుతలం అవుతూవుంది. ఎన్నో ఓటములు, నిరాశలు, నిస్పృహలు, అన్నీ గుర్తువచ్చి వేధిస్తూవున్నాయి. తల్లిగారి సుస్తీ. ఆమె- ప్రాణాలకోసం పోరాడుతూ వుంది.



అయిదేళ్ల క్రితం తండ్రిగారు పోయింతరువాత యిద్దరినీ నిరాశామేఘాలు కప్పివేశాయి. తల్లిని రక్షించుకోవాలని శతవిధాలా ప్రయత్నం చేస్తున్నాడు.. ఒంటరితనం. అసహాయత. చదువులు వేరు, ఆలోచనలు వేరు. జీవితం మరో రకంగా వేధిస్తూంది. ఆలోచనలు ఎంత విశాలంగా పరచుకుంటున్నాయో, జీవితం అంత సంకుచితం అయిపోయి సూదిపోట్లు పొడుస్తోంది. అంతా శూన్యం. అంతేనా? ఇంకేమీ మిగలదా?

చీకటి గదిలోంచి బయటకు వచ్చి వరండాలో పచార్లు చేయనారంభించాడు. కొద్దిపాటి వెలుతురు. సిగరెట్ పొగలు విడుస్తూ తనలో తాను ఆలోచించుకోసాగాడు. మనిషి వివేకవంతమయిన జంతువు! అయినా ఎన్నో అవివేకపు జంతువుల మధ్య అల్లల్లాడుతూ తిరగ వలసిందే. చిన్నతనం రోజులు గుర్తుకు వచ్చినప్పుడల్లా యేదో బాధ. తియ్యటి బాధ. పుల్లటి బాధ. కొండ ప్రాంతంలో ఓ పల్లెటూరు. చీకూ చింతా లేకుండా తన యీడు వాళ్లతో ఆడుకుంటూ కాలక్షేపం చేసేవాడు. ప్రపంచం బాధలన్నీ యింకా మనసుమీద ముద్రలు పడలేదు. పులిపంజాలు, తోడేళ్ల విసుర్లు యింకా తాకలేదు.

చదువు ఆ పల్లెటూరులోనే ప్రారంభం అయింది. మురికి స్కూలు. మాష్టర్లు చదువు వచ్చీ రానివాళ్లు. పాఠాలు చెప్పడం కంటే, పనిష్మెంట్లు యివ్వడం వాళ్లకు బాగా తెలుసు. వాళ్ల చికాకులన్నీ పిల్లలను గోడకుర్చీలు వేయించడంలో,

గుంజీలు తీయించడంలో తీర్చుకునే వాళ్లు. బూతు మాటలు, వంకరటింకర వాక్యాలు.

పెద్దయి కాలేజీలో చేరి పట్టణ వాతావరణానికి అలవాటుపడడంలో భాగంగా, ఆ పల్లెటూరి పలకరింతలన్నీ మరచిపోవడం కోసం అర్ధరాత్రిదాకా పుస్తకాల ముందు కూర్చోవలసివచ్చేది. తలుచుకున్న కొద్దీ ఆ బాధలన్నీ మనసులో తిష్టేసుకు కూర్చునేవి. చదువు సంగతి మరచిపోగలిగితే ఆ పల్లెటూరి జీవనంలో యెంతో కులాసా, ఆనందం వుండేవి. చుట్టూరా పచ్చటి ప్రకృతి. సుకుమారమైన గాలులు. బాదరబందీ లేని రోజులు. ఆ చదువుకునే రోజుల్లోనే ఒక అమ్మాయి- సులలితమయిన మనస్సు వున్నపిల్ల- తరుచుగా అతని మనసులోకి వచ్చి కూర్చుంటుంది యిప్పటికి కూడా. మధ్యాహ్నాలు, సాయంకాలాలు యిద్దరూ మట్టిరోడ్డున ఆడుకుంటూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కాలం గడిపేసేవాళ్లు. పచ్చటి పొలాలలో, పూదోటలలో రకరకాల పక్షులు. సీతాకోక చిలుకలు రెక్కలు విప్పుకు తిరుగాడుతూ వుండేవి. ఆదివారం వస్తే యిక చెప్పనే అక్కర్లేదు. ఆ పక్షుల వెంట - అవి గాలిలో, తను నేలమీద, పరుగులు తీస్తూ వుంటే రోజంతా పొద్దు తెలియకుండా గడిచిపోయేది.

చీకటి పడ్డాక యింటికి వచ్చి అమ్మ పెట్టిన అన్నం గబగబ తినేసి, అమ్మ పక్కలో చేరేవాడు. అమ్మమ్మ యెంతో చక్కగా కథలు చెప్పేది. ఆ కథలు, వాటిలో పాత్రలు- వాళ్ల ప్రవర్తనలు అతని మనస్సుమీద అతికించినట్లుగా నిల్చిపోయాయి. అమ్మమ్మ తరచుగా ఓ పిచ్చివాడి కథ చెప్పేది. వాడు చిన్నప్పటినుంచి పిచ్చివాడు కాడుట. మధ్యలో అలా అయిపోయాడు: ఆ పిచ్చివాడు ఎప్పుడూ శ్మశానంలో తిరుగాడుతూ వుండేవాడు. వాడిని గురించి అనేక కథలు. వాడు చదువుకునేటప్పుడు- కాలేజిలో కూడా- ఎంతో చురుకుగా వుండేవాడట. చౌదరిగారు- ఆయనే ఆ పల్లెటూరికి కామందు, పెద్దదిక్కు- వాడి మీద కత్తి కట్టాడట. వాడు చేసిన నేరం యింత అంత కాదు. ఏకంగా చౌదరిగారి కుమార్తెనే ప్రేమించాడట. ఆ అమ్మాయి కూడా అతనంటే ఆపేక్షగా ప్రేమగా వుండేదిట. ఆయనకు తెలిసి రావడంతోటే, అమ్మాయిని చదువు మానిపించేశాడు. ఆ కుర్రవాడిని తీసుకువచ్చి ఓ చీకటి గదిలో బంధించాడుట. అన్నం, నీళ్లు లేవు. గాలి వెలుతురు అసలే లేవు. ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు. ఏకంగా నలభయి రోజులు. మండలం అయింతర్వాత, తలుపులు తీశాడట. గదిలో ఆ కుర్రవాడి శవంమటుకే మిగిలి వుంది. ఆ శవాన్ని తీసుకుపోయి శ్మశానంలో పారేశాడట! యిలాంటి కథలు ఎన్నో విన్నాడు.

పెద్దయి, చదువుకుని, ఉద్యోగం సంపాదించుకుని... నిజమయిన జీవితం ప్రారంభించిన తరువాత తెలిసి వచ్చింది. యిలాంటి చౌదరిగార్లు ఎందరో వున్నారని దేశనిండా. వాళ్లే సంఘంలో నాయకులు. దేశంలో పెద్దవాళ్లు. పలుకుబడి, అధికారం, పదవులు, పరిపాలన.. అన్నీ వాళ్ల చేతుల్లోనే వున్నాయి. వాళ్లు యెవరినయినా యేమయినా చేయగలరు.

కలలతో ఊహలతో తేలిపోయే జీవితపు రోజులు గడిచిపోయాయి. పల్లెటూరునుంచీ పట్టణానికి, నగరాలకు మారాడు. సోషలిస్ట్‌పార్టీలో చేరాడు. ఎంతో సాహిత్యం చదివాడు. బీదసాదలను ఉద్ధరించాలనీ, సమసమాజం తీసుకురావాలనీ కొత్తరకం కలలు కనడం ప్రారంభించాడు. యవ్వనం అంతా జైలుగోడల మధ్యనే గడపవలసి వచ్చింది. రాజకీయాలు జయించాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అయితే తనలాంటి ఎవరెవరో కాజేశారు. ఆలోచించడం చేతనయి, దేశం కోసం, ప్రజల కోసం మనస్సును, శక్తిని ధారపోసేవాళ్లకు రోజులు లేవు. వాళ్ల అవసరం దేశానికి లేకుండా పోయింది.


> చౌదరిగారు- ఆయనే ఆ పల్లెటూరికి కామందు, పెద్దదిక్కు- వాడి మీద కత్తి కట్టాడట. వాడు చేసిన నేరం యింత అంత కాదు. ఏకంగా చౌదరిగారి కుమార్తెనే ప్రేమించాడట. ఆ అమ్మాయి కూడా అతనంటే ఆపేక్షగా ప్రేమగా వుండేదిట. ఆయనకు తెలిసి రావడంతోటే, అమ్మాయిని చదువు మానిపించేశాడు. ఆ కుర్రవాడిని తీసుకువచ్చి ఓ చీకటి గదిలో బంధించాడుట. అన్నం, నీళ్లు లేవు. గాలి వెలుతురు అసలే లేవు. ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు. ఏకంగా నలభయి రోజులు.


ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్‌లో చేరాడు. ఇంకా యింకా పుస్తకాలు చదవడం, ఆలోచించడంతో కాలం గడపడం నేర్చుకున్నాడు. మనస్సుకు కొత్త కొత్త దారులు యేర్పడుతున్నాయి. అయితే, యీ ఎక్కువగా చదువుకోవడం, ప్రతి విషయాన్నీ చర్చించడం అతనికి కొత్త చిక్కులు తీసుకువచ్చింది. జనం 'అజ్ఞానం'లో వుండిపోవటానికే ఎక్కువ ప్రాధాన్యం యిస్తారనే, 'జనం అజ్ఞానం' మీదనే దివ్యభవనాలు నిర్మించుకోవాలని చూచేవాళ్లు ఎంతో చాకచక్యం వున్నవాళ్లనీ తెలిసిపోయింది. 'జనంలో చైతన్యం రావాలి' అనేది కేవలం నినాదంగానే- పడికట్టు మాటగానే- వుండిపోవాలి తప్ప, అందుకోసం ఎవరూ ఆచరణశీలత పెంచుకోకూడదనీ, అలాంటి లక్షణాలు ఆరోగ్యకరం అయినవి కాదనీ పదిమందీ పలురకాలుగా అతనికి తెలియ చెప్పారు.

జీవితం ఎంతో కాంతివంతమైనది. విషయాలు తెలుసుకున్న కొద్దీ యీ కాంతి విస్తరిస్తుంది. చీకటి పొలనని అంతరింపచేస్తుంది...యిలాంటి మాటలన్నీ ఉపన్యాసాలు యివ్వటానికే పరిమితం అయిపోయాయి. ఈ పరిమితులను బద్దలుకొట్టుకు యువతలకు రావటానికి ప్రయత్నం చేస్తే మటుకు అంతా యమయాతనే! తోటి ప్రొఫెసర్లు కూడా ఆమోదించరు. ఎక్కువ పుస్తకాలు చదవడంకోసం సమయం వృధా చేయగూడదు. ఎక్కువ జీతం సంపాదించటానికి ఎన్ని సమ్మెలయినా చేయటానికి సమయాన్ని ఉపయోగించడం మంచిది- అని వాళ్ల అభిప్రాయం. వివేకవంతులు అనిపించుకునే వాళ్లు కూడా 'లోహఘంటల'కే తలలు వూపటం, వివేకాన్ని కేవలం 'ముసుగు' లాగానే వాడుకోవడం.. అతనికి, ప్రొఫెసర్ రామనాథానికి అమిత చికాకు అనిపిస్తుంది. ఆవేదన కలిగిస్తుంది.

తనలాగ ఆలోచించేవాళ్లు, తన ఆలోచనలను కనీసం ఓపికగా వినేవాళ్లే కరువయిపోతున్న రోజుల్లో.. తనది కేవలం 'పిచ్చితనమే' అనే నమ్మకంలో పడిపోబోతున్న రోజుల్లో... ఆ అమ్మాయి సరోజ పరిచయం అయింది. 'మనిషి-సాంఘిక స్థితిగతులు-పరిణామం' గురించి ప్రత్యేక పరిశీలనలు చేస్తోంది. డాక్టరేట్‌కోసం రెండేళ్లనుంచీ కృషి చేస్తూ, యేదో వివరం కోసం ప్రొఫెసర్ రామనాథం దగ్గరకు వచ్చింది.

ఒకళ్లకొకళ్లు భారం అవకుండా- గంటలకొద్దీ ఎన్నో విషయాలు చర్చించుకునేవాళ్లు. ఏయే అభిప్రాయాలు యేయే పుస్తకాల్లో మరింత వివరంగా దొరుకుతాయో కలబోసుకునేవాళ్లు. మనిషి 'వ్యక్తిత్వాన్ని' గురించి దాని రూపం- అరూపనిర్మాణాల గురించి ఎన్నో కొత్త కొత్త విషయాలు ఆమె నోటిమీదుగానే విన్నాడు రామనాథం. ఆమె విశ్లేషణ తీరు అతన్ని యెంతో ముగ్ధుడిని చేసింది.

'నీ వ్యక్తిత్వంలో అసాధారణమయిన అంశం యేమిటి?' అని అడిగింది ఒకనాడు సరోజ.

అతను ఉలిక్కిపడ్డాడు.

'ఒక విషయాన్ని యెన్ని రోజులయినా ప్రగాఢంగా ఆలోచించగలను నేను. నిర్విరామ చింతనమే జ్ఞానానికి తొలిమెట్టుకదా!' అని జవాబు చెప్పాడు.

'తరువాతి మెట్టు యేమిటి?' అంది ఆమె, అతని కళ్లలోకి లోతుగా చూస్తూ.

అతను ఆకాశపు అంచులవయిపు చూచాడు.

'ఎన్నాళ్లయినా ఆలోచించగలను. నిద్రాహారాలు అవసరం లేదు. జ్ఞానోదయం అయేంతవరకూ వేచివుండగలను.' అన్నాడు బుద్ధుడిని గుర్తుతెచ్చుకుంటూ.

ఆమె చాలాసేపు మౌనంగా వుంది.

అతనూ యేమీ మాట్లాడలేదు.

చివరకు ఆమే అంది. ' ఆలోచించడంలో యెంతో తపన వుంది. ఆ తపనను నువ్వు మాటల్లో చెప్పలేవు. నీ కళ్లు మాత్రం దాన్ని అభివ్యక్తం చేస్తాయి. అదే నీలో నాకు 'నచ్చిన గుణం.' అని.

బుద్ధుడు చేసిన తపస్సు అంతా మదిలో మెదిలింది అతనికి. ఆయన 'వ్యక్తి వికాసం' కోసం ఎక్కువెంపర్లాడలేదు.

దాని సులభ సూత్రాలేవో ఆయనకు త్వరగానే దొరికిపోయాయి. ఆయన తపన అల్లా- తనకు తెలి

సిన దాన్ని సామాన్య జనానికి విశదంగా అర్థం అయ్యేట్టు చెప్పడం ఎలాగా అనే!

ఈ మానవ సమాజం కుళ్లు కంపు కొడుతున్నదన్న సంగతి అందరికీ తెలుసు. ఈ కుళ్లును ఎలా తొలగించవచ్చో తెలుసు. అయితే ఎందుకు తాము తొలగించలేకపోతున్నారో మటుకు తెలియదు.

తపన తృష్ణగా మారతోంది.

తృష్ణ తృప్తిగా కూడా మారుతుంది.

దీనికి 'మనస్సు వివేకం' ఒక్కటే చాలదు. దానికి 'బుద్ధి చేతనం' కూడా జత కావాలి.

సరోజ మరికొంత సేపయిన తర్వాత, యిలా అంది. 'నీ కళ్లలో ఎంతో తపన. కళ్లు యీ తపనతో అలసిపోయినాయి. దీన్నంతటినీ నీ మనసులోనే దాచుకోకు. నోరు విప్పి యితరులతో మాట్లాడు. వాళ్లు ఎంత కుచ్ఛితులయినాసరే, దుర్మతులయినా సరే!'

ఆమె అతని కళ్లను ముద్దు పెట్టుకుంది, లేతగా.

అతను ఆమె కళ్లలో నీటి పొరలను చూచాడు.

సరసంగా వాటిని తుడిచాడు.

సజీవంగా నవ్వాడు.

ఆ రోజునుంచి వాళ్ల స్నేహం మరింత బలపడింది. స్నేహానికి ఓ అర్థం అంటూ యేర్పడింది. అర్థం లేని జీవితం కాదు, అర్థయుత జీవితం యిది- అని అర్థం అయింది.

ఇద్దరూ జీవితాన్ని ఒకే కళ్లతో చూడడం ఆరంభించాడు. నిజమయిన తపన యిప్పుడే ప్రారంభం అయినట్లు అనిపించింది అతనికి. అశాశ్వతమయిన జీవితంలో శాశ్వత జీవతరంగాలను చూడడం...యిదే అతను యిన్నాళ్ళూ చేసిన పని. అదంతా తప్పా?

హాయిగా ముద్దు పెట్టుకున్నా మొదటి రోజున అతనికి ఎంతో స్వేచ్ఛ! అద్భుతం!

ఈ ముద్దు ఎన్నో రోజులు అతనితో వుండిపోయింది. ప్రపంచంలో యిదొక్కటే 'సత్యం' అనిపిస్తోంది. ఎంత అవివేకం! మనిషి తనను తాను బందీ చేసుకోవటానికి ఎన్ని సొరంగాలు తవ్వుకుంటాడు! మాయలు మర్మాలలో పడిపోకుండా వుండాలనే తపనలో అటువంటి ప్రయత్నమే ఒక భంగపాటుగా భావిస్తాడు.




ప్రొఫెసర్ రామనాథం ఏకాంతుడు. రోజులు గడుస్తున్న కొద్దీ యీ యేకాంతం బాధావహం అవుతోంది. భారంగా కుదుపుతోంది.

శాశ్వతమైన 'విశ్వం' ఒకటుంది. తన అశాశ్వతత్వం దానిని గురించి ఆలోచించినప్పుడల్లా భయం కలిగిస్తోంది. 'కలివిడితనం' ప్రారంభించాడు. సత్యాన్ని యెదురుగా చూడడం యిష్టంలేక ఎన్నెన్నో అడ్డదారుల్లో నడవడం మొదలెట్టాడు. ఎన్ని స్నేహితాలయినా, సంబంధాలయినా అన్నీ నిరాశకే దారితీశాయి.

మనిషి 'శాఖా చంక్రమణం' చేస్తున్నాడు. ఒక బంధం నుంచి మరో బంధానికి! చిట్టచివరకు అన్నీ నిరాశను మిగిల్చాక, 'సమర్పణ భావం' గుర్తుకు వస్తోంది. జీవితంలో యెదురయ్యే విషయం యిదే! ప్రతి పరిచయము, సంబంధము తనకు సుఖం కూరుస్తుందనుకోవడంలోనే తనకుతాను బాధలు, భయాలు తయారుచేసుకుంటున్నారు.

సరోజ తనకేదో కొత్త మార్గం చూపుతోందని అనుకున్నప్పుడుకూడా ప్రొఫెసర్ రామనాథం యిటువంటి విచికిత్సలోనే పడిపోయాడు. ఆమెతో సంబంధాన్ని బిగించేసుకున్నాడు. ఆమెమాత్రం రికామీగా మరో వింత ఆలోచన ప్రవేశపెట్టి విడిపోయింది.

'మనిషిని విపరీతంగా ప్రేమించేవాడు భగవంతుడే! ఆయన యితరులు మనిషిని ప్రేమించడం సహించడు. భగవంతుడు ఒక్కడే. ఏకాంతుడే. మనిషి కూడా ఒక్కడే. ఏకాంతుడుగానే వుండిపోవాలని ఆయన తీర్మానం. నిష్కల్మషంగా భగవంతుడితోనే, మనిషి ఏకాంతంగా వుండిపోవాలని ఆయన యిష్టం. మనం విడిపోవడం కూడా ఆయన సిద్ధాంతం వల్లనే. భగవత్సంకల్పం అలాగే వుంది. అంతే!

కథ మళ్లీ దుఃఖాంతం అయింది.

ఈ మలుపు ప్రొఫెసర్ రామనాథాన్ని యింకా ఎక్కువగా క్రుంగతీసింది. తను ఓడిపోయాడు! వంచనకు గురి అయ్యాడు. ప్రాపంచిక విషయాలలో తల ముక్కలయిపోయాడు! కడుపు నింపుకోవడం కోసం జీవితం చూపించిన పెడదారులన్నీ ఆశ్రయించాడు!

జీవితం అంతా యిప్పుడు 'కడుపు' మీద తన్నినట్లయింది. ప్రపంచం దారులకు యెంతగా ఒదిగిపోయినా, మనసులోని అసంతృప్తి- అసమాధానం- అప్పుడప్పుడు బయటకు వచ్చి భంగపాటు కలిగిస్తోంది. అర్ధరాత్రి ఒంటరిగా వున్నప్పుడు యీ తపన మరింత ఎక్కువయిపోతుంది.

మనస్సు, బుద్ధి పడే యీ యాతనలన్నీ నిజమైన వ్యక్తిత్వానికి దోహదం చేయడం లేదు. వాటి దుర్గుణాలను తొలగించడం లేదు.

ఉద్రేకాలు అడుక్కు వెళ్లిపోతున్నాయి.

ఏదో పోగొట్టుకున్నాననే భావం పట్టి పల్లారుస్తోంది.

రాత్రులు నిద్రరాదు.

చంద్రుడు ఆకాశంలో కిందకు దిగిపోతున్నాడు. ప్రొఫెసర్ రామనాథం చంద్రుడి వంక కాస్సేపు చూచి, జాలిగా తన గదిలోకి వెళ్లిపోయాడు. పక్క మీదకు వాలిపోయాడు.

జీవంలేని జీవితంలో మరో అర్థం లేని రోజు యింకాస్సేపటికి ఉదయిస్తుంది.

★